క్లుప్తంగా

పెద్దమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన



కమిషనర్‌ను సన్మానిస్తున్న విఠల్ బాబా

పహాడీషరీఫ్: ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానున్న జల్‌పల్లి గరిగుట్ట పెద్దమ్మ జాతరకు సంబంధించిన ఏర్పాట్లను కమిషనర్ బి.వెంకట్రామ్ శనివారం పరిశీలించారు. జాతర కోసం మున్సిపల్ తరఫున మంజూరు చేసిన రూ.3 లక్షలతో చేపట్టాల్సిన సదుపాయాలపై ఆయన ధర్మకర్త కరన్‌కోట్ విఠల్‌బాబాతో కలిసి చర్చించారు. ఆలయానికి వచ్చే రూట్‌లోని మట్టి రోడ్డుకు మరమ్మతులు, విద్యుత్, నీటి సదుపాయం, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలలో ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఈ సందర్భంగా వెల్లడించారు. ముఖ్యంగా ఆదివారం బోనాల సమర్పణ, సోమవారం జరగనున్న కల్యాణానికి భక్తులు భారీగా తరలిరానున్న నేపథ్యంలో పారిశుద్ధ్య సిబ్బందిని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుతామన్నారు. అంతకుముందు ఆయన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కమిషనర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ పర్యావరణ అధికారి ఎం.శ్రీనివాస్, సూపర్‌వైజర్ బుడుమాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై ఫిర్యాదు



కమిషనర్ వెంకట్రామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ స్థానిక నాయకులు సంతోష్, సుమిత్, శ్రీనివాస్ మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్రామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కార్యాలయంలో కలిసి విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శ్రీరాం కాలనీపై బస్టాప్ నుంచి దిగువన ఎర్రకుంట వరకు రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారన్నారు. ఈ కారణంగా ట్రాఫిక్ స్తంభించడంతో పాటు ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.

పుస్తకావిష్కరణకు ఆహ్వానం



సీఎంకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న వీరేందర్‌గౌడ్, విజయేందర్‌గౌడ్

తుక్కుగూడ: తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి తూళ్ల దేవేందర్‌గౌడ్ రాష్ట్ర సాధనలో ఆయన పాత్ర, చారిత్రక వాస్తవాలు, అనుభవాల ఆధారంగా విజయ తెలంగాణ పుస్తకాన్ని రచించినట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పుస్తకాన్ని ఈ నెల14న నగరంలోని జలవిహార్‌లో ఆవిష్కరిస్తునమన్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానం అందజేశామన్నారు. రాష్ట్ర అభివృద్ధి, రాష్ట్ర సాధనలో తన తండ్రి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తూళ్ల విజేయందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బీఎల్‌ఓకు సన్మానం



నరేందర్‌ను సన్మానిస్తున్న షేక్ అఫ్జల్

పహాడీషరీఫ్: మహేశ్వరం నియోజకవర్గంలో ఉత్తమ బీఎల్‌ఓగా అవార్డు అందుకున్న జల్‌పల్లి మున్సిపాలిటీ బిల్ కలెక్టర్ నరేందర్‌ను మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్ అఫ్జల్ సన్మానించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం శాలువా కప్పి సత్కరించారు. ఓటర్ జాబితాకు సంబంధించి చక్కటి విధి నిర్వహణతో అవార్డు అందుకోవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

స్కూళ్లకు స్కావెంజర్లు

- పాఠశాలల్లో తీరిన పారిశుద్ధ్య సమస్యలు
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు
- అమ్మ ఆదర్శ కమిటీలకు నిర్వహణ బాధ్యత



మండల విద్యావనరుల కేంద్ర భవనం

కేశంపేట: గతంలో పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం స్కావెంజర్లను నియమించి, వారితో కొద్దిరోజులు పనులు చేయించుకొని 2021లో తొలగించారు. అప్పటి నుంచి గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ చేయాలని గత ప్రభుత్వం సూచించింది. గ్రామ పంచాయతీల్లో సరైన సిబ్బంది లేకపోవడం, ఉన్నవారు కూడా బాత్‌రూంలను క్లీన్ చేసేందుకు ఇష్టపడకపోవడం లాంటి కారణాలతో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పాఠశాలల్లో పాఠశాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం కోసం వ్యక్తిని నియమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పారిశుద్ధ్య నిర్వహణకు స్కూల్ ఫెసిలిటీ మెయింటెన్స్ నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. పాఠశాల అవసరాల కోసం పనిచేస్తున్న వ్యక్తికి పారితోషకాన్ని ఇచ్చే బాధ్యత అమ్మ ఆదర్శ కమిటీలకు ప్రభుత్వం అప్పగించింది. ప్రభుత్వం ద్వారా పాఠశాలలకు వస్తున్న సమగ్ర శిక్ష నిధులకు అదనంగా పాఠశాల అవసరాల నిర్వహణకు అందిస్తోంది.

తీరిన సమస్యలు..

పాఠశాల అవసరాల కోసం ఏర్పాటు చేసిన వ్యక్తితో పాఠశాల అవరణలో మొక్కలకు నీళ్లు పోయడంతో పాటు పాఠశాల పరిసరాలను శుభ్రం చేయడం, మరుగుదొడ్లను శుభ్రం చేయడం తదితర పనులు చేపట్టనున్నారు. గతంలో వీటి నిర్వహణను ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఇవ్వడంతో చాలా గ్రామాల్లో వారంలో ఒక్కరోజు మాత్రమే వీటి నిర్వహణ జరిగేది. కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, మరికొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు కలిసి చందాలు వేసుకొని స్కావెంజర్లను గతంలో ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం పాఠశాల అవసరాల కోసం వ్యక్తిని ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో పాఠశాలలు పరిశుభ్రంగా మారాయి.

మండలంలో..

మండల పరిధిలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో 08 ఉన్నత పాఠశాలలు, 08 ప్రాథమికోన్నత పాఠశాలలు, 24 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 3వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. మండలంలో సుమారుగా 45 మందిని పాఠశాల అవసరాల కోసం నియమించారు.

నిధులు ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం పాఠశాల అవసరాల కోసం వ్యక్తిని నియమించుకునేందుకు జీఓ 21ని విడుదల చేసింది. జిల్లా మినరల్ ఫండ్ ట్రస్ట్ ద్వారా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులను విడుదల చేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 01 నుంచి 30 మంది వరకు ఉంటే 3వేలు, 31 నుంచి 100 వరకు ఉంటే 6వేలు, 101 నుంచి 250 మంది ఉంటే 8వేలు, 251 నుంచి 500ల మంది ఉంటే 12వేలు, 501 నుంచి 750 వరకు విద్యార్థులు ఉంటే 15వేలు, 750 కంటే ఎక్కువ ఉంటే 20వేలను నెలకు చొప్పున అందిస్తారు. అమ్మ ఆదర్శ కమిటీలు ఈ నిధులను ప్రధానోపాధ్యాయుల భాగస్వామ్యంతో ఖర్చు చేస్తున్నారు. అయితే స్కావెంజర్లతో కమిటీ ఎలాంటి ఒప్పందం చేసుకునే వెసులుబాటు లేదు.

అమ్మ కమిటీలదే బాధ్యత



పాఠశాలలో అవసరాల కోసం వ్యక్తిని నియమించుకోమని ప్రభుత్వం తెలిపింది. వారికి ఎలాంటి అటెండెన్స్ ఉండదు. వారికి నేరుగా జీతాలు ఇవ్వడం లేదు. పాఠశాలలో విధులను నిర్వహిస్తున్న వారి బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలు పర్యవేక్షిస్తున్నాయి. వీరిని నియమించడంతో పాఠశాలలు పరిశుభ్రంగా మారాయి.

– చంద్రశేఖర్, మండల విద్యాధికారి

‘లక్ష డప్పుల’కు తరలిరండి

మీర్‌పేట: ఫిబ్రవరి 7న నిర్వహించే ‘వేల గొంతులు లక్ష డప్పుల’ మహా ప్రదర్శనకు మీర్‌పేట కార్పొరేషన్ నుంచి మాదిగ, ఉప కులాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబు మాదిగ పిలుపునిచ్చారు. శనివారం మీర్‌పేట కూడలిలో మహాప్రదర్శన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వర్గీకరణ ద్వారానే మాదిగ, ఉపకులాలకు అన్ని రంగాల్లో న్యాయం జరుగుతుందన్నారు. వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించి చిత్తశుద్ధి నిలుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి ముదిరాజ్ సంఘం నాయకులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ మాదిగ, జిల్లా నాయకులు బొర్ర రవిమాదిగ, నర్సింహ మాదిగ,బైగళ్ల ఓంప్రకాశ్, దయానంద్ ముదిరాజ్, రాజేందర్ ముదిరాజ్ ఎల్లయ్య మాదిగ, దాసరి బాబు తదితరులు పాల్గొన్నారు.



మహా ప్రదర్శన వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మంచినీటి సమస్య రాకుండా చూడాలి

మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్

మొయినాబాద్: వేసవిలో మంచినీటి సమస్య రాకుండా ముందు నుంచే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా మొయిజుద్దీన్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు, మొయినాబాద్, పెద్దమంగళారం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఉన్న కార్యాలయాల్లో వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, మంచినీటి సమస్య లేకుండా చూడాలన్నారు. మురుగు కాల్వలు, చెత్తాచెదారం ఎప్పటికప్పుడూ శుభ్రం చేయించాలని సూచించారు. ఆయన వెంట అధికారులు వెంకటేశ్, సుదర్శన్, సిబ్బంది రాజేశ్ ఉన్నారు.

హిమాయత్‌నగర్‌లో..

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామాన్ని మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా మొయిజుద్దీన్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సంధ్యారాణి, సుహాసిని, అజీజ్‌నగర్ పంచాయతీ కారోబార్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



చిలుకూరులో అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

స్టేడియం నిర్మాణానికి స్థల పరిశీలన



స్టేడియం నిర్మాణ స్థలంలో అధికారులు

కొందుర్గు: కొందుర్గు మండల కేంద్రంలో స్టేడియం ప్రతిపాదిత స్థలాన్ని శనివారం అధికారులు పరిశీలించారు. కొందుర్గు పడమర శివారులోని సర్వే నెంబర్ 19లో గల 7 ఎకరాల 13 గుంటల స్థలాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచన మేరకు రెవెన్యూ అధికారులు ఇదివరకే స్టేడియం కోసం ప్రతిపాదించారు. కాగా శనివారం జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థలాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేడియం ఏర్పాటుకు స్థలం అనుకూలంగా ఉన్నట్లు ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కార్యాలయం సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్, డిప్యూటీ తహసీల్దార్ రాకేశ్, ఆర్ఐ శివ, సర్వేయర్ ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు రాములుగౌడ్, గోవర్ధన్‌గౌడ్, నరేందర్, జీబీ కృష్ణ, వేణుగోపాల్‌గౌడ్, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

బీజేపీ యువ నాయకుడు వైభవ్‌రెడ్డి



వైద్యశిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చేవెళ్ల: గ్రామాల్లో ఉండే పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో శనివారం మల్గారి వైభవ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీఎక్స్ ఆస్పత్రి సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో ప్రజలకు వివిధ రకాల డాక్టర్లు వైద్యపరీక్షలు చేసి సలహాలు అందించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు వ్యూహారెడ్డి, రోహిత్‌రెడ్డి, శివకుమార్, రక్షిత్‌రెడ్డి, వినయ్, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలను ప్రైవేట్‌కు దీటుగా అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేసిన ఎన్‌సీఆర్ అట్లియోస్ సంస్థ ప్రతినిధుల సహకారం మరువలేనిదని కుమ్మెర మాజీ సర్పంచ్, జిల్లా బీసీ సేన జిల్లా అధ్యక్షుడు జూలూరి పాండుగౌడ్ అన్నారు. మండలంలోని కుమ్మెర గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను కొన్ని రోజులుగా ఎన్‌సీఆర్ అట్లియోస్ ఇండియా అనే సంస్థ ప్రతినిధులు 25 లక్షల రూపాయలతో పాఠశాలకు పెయింటింగ్, కాంపౌండ్, బాత్‌రూమ్‌లు, కంప్యూటర్స్, టీవీ తదితర అన్ని సౌకర్యాలు కల్పించి శనివారం గ్రామ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఎంపిక చేసుకొని ప్రైవేట్‌కు దీటుగా మార్చిన కంపెనీ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్‌సీఆర్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయటంతో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బలరాం, నాయకులు, యాదవ్, ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేసవిలో డిమాండ్‌కు తగిన విద్యుత్‌ను అందిస్తాం

హుడాకాంప్లెక్స్: వేసవిలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని సరూర్‌నగర్ సూపరింటెండెంట్ సి.మాధవరెడ్డి తెలిపారు. ఫిబ్రవరి నెలలోనే ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో సర్కిల్‌లో విద్యుత్ సరఫరాను క్షేత్ర స్థాయిలో మెరుగుపరచడం కోసం విద్యుత్ శాఖ కీలక చర్యలు తీసుకుని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఇందు కోసం 49, 11కేవీ లైన్లను ప్రతిపాదించగా, అందులో 34 పనులు పూర్తయ్యాయని, 7, 33కేవీ లైన్లను ప్రతిపాదించగా, 6 పనులు ప్రగతిలో ఉన్నాయని వివరించారు.వేసవిలో విద్యుత్ డిమాండ్లను సమర్థవంతంగా తీరుస్తామని చెప్పారు.

రోగులకు పండ్లు పంపిణీ



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కందుకూరు: ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నాయకుడు కుర్మమోని జయేందర్‌ముదిరాజ్ పుట్టినరోజును పురస్కరించుకొని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శనివారం కందుకూరు పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు పిట్టల పాండుముదిరాజ్, ఆ సంఘం నాయకులు కొర్వి సురేందర్‌ముదిరాజ్, జంగయ్యముదిరాజ్, ఎరగమోని నర్సింహాముదిరాజ్, సంఘం యూత్ ఉపాధ్యక్షుడు నరేందర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు మేలు

సాధ మల్లారెడ్డి, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు



కందుకూరు: ప్రధాని మోదీ సారథ్యంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామ్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ దేశంలోని అన్ని వర్గాలకు మేలుచేసే విధంగా ఉందని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సాధ మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బడ్జెట్‌లో కేటాయింపులు మధ్య తరగతి, ఉద్యోగ, బలహీన వర్గాలు, మహిళలకు పెద్దపీట వేస్తూ ఊరట కలిగించేలా ఉందని కొనియాడారు. అలాగే పన్నుల శ్లాబ్స్ మినహాయింపులు, వైద్య, ఆరోగ్య శాఖలకు సంబంధించి ప్రజలకు ఉపయోగపడే విధంగా కేటాయింపులు ఉన్నాయన్నారు. మొత్తంగా ప్రజలకు ఉపయోగపడే బడ్జెట్ ప్రవేశపెట్టడం సంతోషించదగ్గ విషయమన్నారు.

ఘనంగా శివాలయ వార్షికోత్సవం

నందిగామ: మండల పరిధిలోని బుగ్గోనిగూడలో శివాలయాన్ని నిర్మించి రెండు ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆలయంలో ద్వితీయ వార్షికోత్సవాన్ని శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో గ్రామస్తులు పెద్దఎత్తున సామూహిక పూజలు, వ్రతాలు, హోమాలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేకంగా పూజలు కొనసాగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే వ్యాపారాలు

- వాహనదారుల ఇబ్బంది
- రద్దీతో ట్రాఫిక్ జాం
- పట్టించుకోని అధికారులు



సాగర్ రోడ్డుపైనే ఏర్పాటు చేసిన దుకాణాలు

తుర్కయంజాల్: రహదారికి ఇరువైపులా చిరువ్యాపారులు ఏర్పాటు చేస్తున్న దుకాణాలు, తోపుడు బండ్లతో వాహనదారులు, బాటసారుల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అయినప్పటికీ ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

అక్కడ తొలగిస్తే.. ఇక్కడికి

నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే పురపాలక సంఘం పరిధి సాగర్ రహదారిని ఆనుకొని చిరు వ్యాపారులు ఇష్టానుసారంగా దుకాణాలను ఏర్పాటు చేస్తూ.. వాహనదారులకు ఇబ్బందిగా మారారు. అయినప్పటికీ.. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇంజాపూర్ కూడలి నుంచి గుర్రంగూడ వరకు ప్రమాదకర రీతిలో మలుపుల వద్ద దుకాణాలు కొనసాగిస్తున్నారు. గతంలో సాగర్ కాంప్లెక్స్ వద్ద ఉన్న పండ్ల షాపులను జీహెచ్ఎంసీ, పోలీసులు తొలగించడంతో రూటు మార్చి పురపాలక సంఘం పరిధి సాగర్ రహదారిపై ఏర్పాటు చేశారు.

చెరువు కట్టపై..

మాసబ్ చెరువు కట్టపైన చిరువ్యాపారులు పదుల సంఖ్యలో తోపుడు బండ్లు, చిరు దుకాణాలను ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ప్రతి రోజు సాయంత్రం సమయంతో పాటు శని, ఆదివారాల్లో కట్టపైన ఉన్న పార్కుకు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆ సమయాల్లో దుకాణాలతో పాటు, వాహనాలను అడ్డదిడ్డంగా నిలపడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రద్దీ వేళలో ట్రాఫిక్‌ను నియంత్రించడం, వాహనాలు నిలపకుండా చర్యలు చేపట్టడంలో మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు విఫలమవుతున్నారు.

ఔటర్ రింగ్ రోడ్డు నుంచి..

బొంగుళూరు గేటు ఔటర్ రింగు రోడ్డు జంక్షన్ నుంచి మొదలుకుని మన్నెగూడ కూడలి వరకు మధ్యాహ్న సమయాల్లో రోడ్డుకు ఆనుకుని హోటళ్లు, పండ్ల దుకాణాలను ఏర్పాటు చేయడంతో వాహనచోదకులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇలాగే కొనసాగితే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వెంటనే వీటిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి, తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తొలగిస్తాం



సాగర్ రోడ్డుకు ఇరువైపులా దుకాణాలను ఏర్పాటు చేయొద్దని పలుమార్లు నిర్వాహకులను హెచ్చరించాము. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా వ్యాపారం చేసుకోవాలని సూచించాము. అయినా వారిలో మార్పు రావడం లేదు. వాటిని తొలగింపచేస్తాం.

– అమరేందర్ రెడ్డి, కమిషనర్, తుర్కయంజాల్

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి

షాబాద్: పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలంతా ఐక్యంగా ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు కలిసి పనిచేస్తేనే విజయం సాధిస్తామన్నారు. కార్యకర్తల సమస్యలు తెలుసుకొని దశలవారీగా పరిష్కరిస్తానని హామీనిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామాన్ని ఎంపిక చేసి, గ్రామంలోని 573 మంది రైతులకు రైతు భరోసా డబ్బులు జమ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అక్తర్‌పాషా, శ్రీరాంరెడ్డి, మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, గుండాల అశోక్, సీనియర్ నాయకులు రవీందర్, మల్లారెడ్డి, ఆస్మత్‌పాషా, చేవెళ్ల నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మంగలి చెన్నయ్య, పామెన నర్సింలు తదితరులు ఉన్నారు.

చిన్నషాపూర్‌ను జీపీగా ఏర్పాటు చేయాలని నిరసన

మొయినాబాద్: మొన్నటి వరకు పెద్దమంగళారం గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉండి కొత్తగా ఏర్పాటైన మొయినాబాద్ మున్సిపాలిటీలో కలిపిన చిన్నషాపూర్ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం గ్రామంలోనే గ్రామస్తులంతా బైఠాయించి నిరసన తెలిపారు. ప్రత్యేక రెవెన్యూ పరిధి ఉన్న చిన్నషాపూర్‌ను గ్రామ పంచాయతీగా చేయాలన్నారు. ఎన్నో ఏళ్లుగా అనుబంధ గ్రామంగా ఉన్న చిన్నషాపూర్ అభివృద్ధికి నోచుకోలేదని, గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేస్తే అభివృద్ధి జరుగుతుందన్నారు. మున్సిపాలిటీలో కలపడంతో చిట్ట చివరన ఉన్న తమ గ్రామాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోరన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.

లయన్స్‌క్లబ్ సేవలకు గుర్తింపు

- ప్రపంచంలో 43వ క్లబ్‌గా ఆమనగల్లు
- లయన్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి

ఆమనగల్లు: నిరంతరం ప్రజాసేవలో తరిస్తున్న లయన్స్‌క్లబ్‌కు అరుదైన గుర్తింపు లభించిందని లయన్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ పరిధిలో 43వ పెద్ద క్లబ్‌గా, దేశంలో 31వ క్లబ్‌గా, తెలంగాణలో ఆమనగల్లు క్లబ్‌కు మొదటి గుర్తింపు దక్కిందని పేర్కొన్నారు. పట్టణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని తేజ కన్వెన్షన్ హాలులో ఈ నెల 15న నిర్వహించే క్లబ్ రీజియన్ కాన్ఫరెన్స్ కరపత్రాలను క్లబ్ ఎల్‌సీఎఫ్ ఏరియా లీడర్ నరేందర్‌రెడ్డి, రీజియన్ చైర్మన్ డాక్టర్ శ్రీనులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాన్ఫరెన్స్‌కు రీజియన్ పరిధి 11 క్లబ్‌ల సభ్యులు హాజరుకావాలని కోరారు. క్లబ్ 320ఏ జిల్లా పరిధిలోని క్లబ్‌లలో ఆమనగల్లు క్లబ్‌లో 230 సభ్యులు ఉన్నారని ఆయన వెల్లడించారు.

గర్వకారణం

లయన్స్‌క్లబ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కంటి ఆస్పత్రి, కడ్తాలలోని నేత్ర చికిత్సాలయం, కల్వకుర్తిలో డయాగ్నోస్టిక్ సెంటర్‌ను నిర్వహిస్తూ ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు. వీల్స్ ఆన్ మీల్స్ పేరుతో అన్నదానం చేస్తున్నామని తెలిపారు. ఈ సేవలకు గుర్తింపుగా లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా ఆమనగల్లుకు మొదటి గుర్తింపు రావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో క్లబ్ ఆమనగల్లు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి మహేశ్, కోశాధికారి నర్సింహ, పీఆర్‌ఓ పాష, జోన్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, సభ్యులు డాక్టర్ దామోదర్‌రెడ్డి, డాక్టర్ మురళీధర్, డాక్టర్ కృష్ణ, జిల్లా చైర్మన్లు అంజయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.